ఈనాడు

Karimnagar 10.07.2012

# 25 ఏళ్ల క్రితం అదృశ్యం.. నేడు ప్రత్యక్షం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: యుక్త వయసులో అదృశ్యమైన తమ వాడి కోసం ఓ కుటుంబం పరితపించింది. అన్ని చోట్ల వెతికింది. విస్తృతంగా గాలించింది. అయినా అతని ఆచూకీ లభించలేదు. చేసేదేమి లేక అన్ని ఆశలు వదులుకుంది. కానీ 25 సంవత్సరాల తర్వాత ఆ వ్యక్తి మళ్లీ ప్రత్యక్షమవడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వెన్నం అనసూర్య, చంద్రయ్య దంపతులకు ముగ్గురు కొడుకులు రెండో కొడుకు నర్సయ్య 1987లో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబీకులంతా అతని కోసం గాలించినా ఫలితం లేకపోయింది. నర్సయ్య మతిస్థిమితం కోల్పోయి



నర్సయ్యను (పసుపు రంగు టీషర్టు) సోదరి సువర్ణకు అప్పగిస్తున్న సంస్థ ప్రతినిధులు

25ఏళ్లుగా హైదరాబాద్‌లో తిరుగుతున్నాడు. మహారాష్ట్రకు చెందిన శ్రద్ధ రిహాబిలిటేషన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వారు మతిస్థిమితం లేని వారిని అక్కున చేర్చుకుని చికిత్స అందిస్తారు. ఈ క్రమంలో 2012 జనవరి 1న సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో పర్యటిస్తుండగా మతిస్థిమితం లేని నర్సయ్యను ఆశ్రమానికి తీసుకెళ్లారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ భరత్‌వాత్వాని నర్సయ్యకు వైద్యం అందించారు. వారం రోజుల క్రితం బాగుపడిన అతన్ని విచారించగా చిరునామా తెలిపాడు. సంస్థ ప్రతినిధులు మహారాష్ట్ర వాసి విజయ్‌బ్రహ్మాణీ, తూర్పుగోదావరి జిల్లా చిట్టిచెర్వు గట్టుకు చెందిన కిషోర్‌కుమార్ కలిసి నర్సయ్య(50)ను సోమవారం సాయంత్రం ఎల్లారెడ్డిపేటకు తీసుకువచ్చారు. సోదరి సువర్ణకు అప్పగించారు.